సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



నో టెన్షన్.. ఓన్లీ ప్రిపరేషన్

పరీక్షల వేళ విద్యార్థులు ఆందోళన చెందొద్దని, మంచి మార్కులు వస్తాయనే సంకల్పంతో ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. 8లో



..సెమీస్‌కు సింగరేణి జట్టు

నాగ్‌పూర్‌లో జరుగుతున్న కోలిండియా స్థాయి క్రికెట్, క్యారమ్స్ టోర్నీలో సింగరేణి క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. సాయంత్రం కొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి మహా కుంభాభిషేకం

వివరాలు వెల్లడించిన పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ



మాట్లాడుతున్న ఈఓ రజనీకుమారి

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్. రజనీకుమారి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆలయ సముదాయంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో స్వామివారి పరివార దేవతా సహిత జీవధ్వజ పాంచాహ్నిక దీక్షా ప్రతిష్ఠాపన, పెద్దమ్మతల్లి ఆలయ 64వ వార్షికోత్సవం సందర్భంగా పంచమ పుష్కర (షష్టాబ్ది)పూర్వక మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. నేడు ఉదయం మంగళ తోరణాలంకరణ, విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు మొదలవుతాయని చెప్పారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పసుపు నీళ్లతో జలాధివాసం, శనివారం క్షీరాధివాసం, సాయంత్రం ప్రతిష్ఠా విగ్రహాల గ్రామోత్సవం, ఆదివారం ఉదయం 10.30 గంటలకు ధాన్యాధివాసం, ఫలాధివాసం, హిరణ్యాధివాసం, శయ్యాధివాసం, సోమవారం ఉదయం 9.15 గంటలకు కల్యాణ మండపం, అన్నదాన సత్రం ప్రారంభోత్సవం, 11.30 గంటలకు శివాలయంలో స్వామివారి ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్



ఇన్‌టేక్ వెల్ వద్ద పరిశీలిస్తున్న సీఈ శ్రీనివాస్

అశ్వాపురం : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ సీఈ కె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మండలంలోని కుమ్మరిగూడెంలో దుమ్ముగూడెం ఆనకట్ట, మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్, రథంగుట్ట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. కుమ్మరిగూడెంలోని ఇన్‌టేక్ వెల్ నుంచి జిల్లా వ్యాప్తంగా గల గ్రామాలకు నీరు అందుతున్నందున సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నళిని, డీఈ మహేందర్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

15న కొత్తగూడెంలో సైన్స్ ఎక్స్‌పో

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వ్యవసాయం, ఆరోగ్యం–ఆహారం, ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎన్విరాన్‌మెంట్ అండ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సైన్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అనే అంశాలపై ఎగ్జిబిట్లు ప్రదర్శించాల్సి ఉంటుందని వివరించారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పోటీలకు అర్హులని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల, ఆశ్రమ, మైనార్టీ, కేజీబీవీ.. ఇలా అన్ని పాఠశాలల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి కనీసం నాలుగు ఎగ్జిబిట్లు ప్రదర్శించాలని తెలిపారు. ఎక్స్‌పోకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నామని, విజేతలకు నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. గతంలో సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రదర్శించిన ఎగ్జిబిట్లకు కూడా తిరిగి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

పలు రైళ్ల రద్దు.. ఇంకొన్ని దారి మళ్లింపు

ఖమ్మం రాపర్తినగర్: మూడో లైన్ నిర్మాణ పనుల కారణంగా ఖమ్మం మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేయగా, ఇంకొన్నింటిని దారి మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కాజీపేట – విజయవాడ మార్గంలో నడిచే 30 రైళ్లను ఈనెల 10నుంచి 20వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంకొన్నింటిని సికింద్రాబాద్ – నడికుడి మార్గంలో నడిపించనున్నట్లు వెల్లడించారు. అలాగే, వారాంతపు రైళ్లను కూడా రద్దు చేయగా మరికొన్ని రైళ్లు నిర్ణీత తేదీల్లోనే నడుస్తాయని తెలిపారు.

మణుగూరు అటవీ ప్రాంతంలో ట్రాపింగ్ కెమెరాకు చిక్కిన పెద్దపులి



టైగర్..భద్ర!

- మణుగూరు అడవుల్లో రెండు నెలలుగా పెద్దపులి మకాం
- మూడేళ్ల తర్వాత మళ్లీ కనిపించిన అడుగుజాడలు
- మణుగూరు అటవీ ప్రాంతంలో ట్రాపింగ్ కెమెరాలకు చిక్కిన వైనం
- మగ పులిగా నిర్ధారణ.. భద్ర అని నామకరణం

పాల్వంచరూరల్: జిల్లా అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. గత కొన్నేళ్లుగా పులి అప్పుడప్పుడు జిల్లాలోకి ప్రవేశిస్తున్నా.. కొన్ని రోజుల సంచారం తర్వాత తిరిగి వెళ్లిపోయేది. అయితే గత డిసెంబర్ 10న ఏటూరునాగారం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, ములుగు అటవీ ప్రాంతం ద్వారా వెంకటాపురం(కె)మండలం బోదాపురంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి మల్లూరు గుట్టల మీదుగా మణుగూరు అటవీ ప్రాంతంలోకి వచ్చినట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై తమ పరిధిలోని అటవీ ప్రాంతంలో ట్రాపింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

10 లక్షల ఎకరాల్లో అడవి..

జిల్లా అటవీ విస్తీర్ణం 10 లక్షల ఎకరాలు ఉండగా ఇందులో కిన్నెరసాని అభయారణ్యం 634.4 చదరపు కిలోమీటర్లు ఉంది. కాగా, గొత్తికోయలు అధికంగా ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం, రెండు లక్షల ఎకరాల్లో పోడు సాగు చేయడం, మరో లక్ష ఎకరాల అడవిని నరికి వేయడంతో క్రమంగా అటవీ విస్తీర్ణం తగ్గింది. దీంతో జిల్లాలో పులులు మనుగడ సాగించలేకపోతున్నాయి. అయితే గత ఆరేడేళ్లుగా ప్లాంటేషన్ పెంచడంతో క్రమంగా అడవి పెరుగుతోంది. గత మూడేళ్లుగా జిల్లాలోకి పెద్దపులి ప్రవేశిస్తున్నా.. స్థానికంగా నివాసం ఉండడం లేదు. దీంతో రెండు నెలల క్రితం వచ్చిన పులి తిరిగి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వేటాడకుండా గొత్తికోయలు, గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎట్టకేలకు రెండు నెలలుగా పులి జిల్లా దాటి వెళ్లకుండా చూడగలిగారు. దీన్ని మగ పులిగా నిర్ధారించిన అధికారులు.. భద్ర అని నామకరణం చేశారు. ప్రస్తుతం మేటింగ్ సమయం కావడంతో ఆడ పులి కూడా ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఈనెల 2వ తేదీన మణుగూరు అటవీ ప్రాంతంలో ట్రాపింగ్ కెమెరాకు మగ పులి మాత్రమే చిక్కిందని డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్ బుధవారం వెల్లడించారు.

జిల్లా నుంచి కారిడార్..

భౌగోళికంగా జిల్లా అటవీ విస్తీర్ణం ఇటు ఏటూరునాగారం, అటు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను ఆనుకుని ఉండడంతో పులుల రాకపోకలకు కారిడార్‌గా మారింది. జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యం పెద్దపులుల ఆవాసానికి అనువుగానే ఉన్నా.. పులి నివాసం ఉండకుండా తిరిగి వెళ్లిపోతోంది. గతంలో ఈ అభయారణ్యంలో మూడు పెద్ద పులులు సంచరించేవి. పగిడేరు, రేగళ్ల, అనంతోగు, మల్లేపల్లితోగు, మర్కోడు, ఉల్వనూరు ఏరియాల్లో దట్టమైన అడవులు ఉండడంతో పులి నివాసానికి వీలుగా ఉండేవి. కానీ 2018 తర్వాత జిల్లాలో పులి ఆవాసమే లేదని వైల్డ్ లైఫ్ అధికారులు అంటున్నారు.

పులి ఇక్కడే ఉండేలా చర్యలు



జిల్లా అటవీ ప్రాంతంలోనే రెండు నెలలుగా పెద్దపులి మకాం వేసింది. అది ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకున్న కీర్తిప్రతిష్ఠలను దృష్టిలో పెట్టుకుని పులికి 'భద్ర'గా నామకరణం చేశాం. మణుగూరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్టు గుర్తించాం. అయితే ప్రజలు భయాందోళన చెందొద్దు. ఎక్కడైనా పులి కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతాన్ని తిరిగి విస్తరింపజేసే పనిలో నిమగ్నమయ్యాం. వేటను అరికట్టేందుకు గొత్తికోయ గ్రామాలపై నిఘా పెంచాం. అడవిలో నీటి వనరులను ఏర్పాటు చేయడంతో పాటు పులులకు ఆహారమైన సాంబార్ జింకల వంటి జంతువులను పెంచడంపై దృష్టి పెట్టాం.

– కృష్ణాగౌడ్, జిల్లా అటవీ శాఖాధికారి

మెరుగైన వైద్య సేవలందించాలి

వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

పాల్వంచ: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డు, గర్భిణుల వార్డులను పరిశీలించారు. ఇన్ పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఓపీ, సిబ్బంది వివరాలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని, ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైన మందులు సరిపడా నిల్వ పెట్టుకోవాలని చెప్పారు. వివిధ రకాల జబ్బులతో ఆస్పత్రికి వచ్చే బాధితులకు శుచికరమైన, బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ రాంప్రసాద్, వైద్యులు శైలేష్, మోహన్ వంశీ, రాంప్రసాద్, లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సరళ పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న బాలుడిని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, వైద్య సిబ్బంది

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీ



ఇల్లెందు : ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఇల్లెందు, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావుతో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు.

క్లినికల్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్) ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణులైన వారు ఏడాది క్లినికల్ అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇచ్చే శిక్షణకు ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా ఫారం, సర్టిఫికెట్ల జిరాక్స్‌లకు రూ.10 పోస్టల్ స్టాంప్‌తో కూడిన సొంత చిరునామా కవర్ జతపరిచి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 15లోగా అందజేయాలని తెలిపారు.

ముగిసిన వాగ్గేయకారోత్సవాలు

ఐదు రోజుల పాటు భద్రగిరిలో సంగీత హోరు

భద్రాచలం: భక్త రామదాసు జయంత్యుత్సవాల సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వాగ్గేయకారోత్సవాలు బుధవారం ముగిశాయి. పలువురు సంగీత కళాకారులతో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు వీనులవిందుగా సాగాయి. చివరి రోజు బుధవారం ఉదయం సీహెచ్ వెంకటనారాయణ చేసిన వేణుగానం, శ్రీనిధి, నల్లాన్ చక్రవర్తుల పార్థసారధి, డి.వి.మోహన్ కృష్ణ బృందం ఆలపించిన దేశీయ సంగీతం అందరినీ ఆకట్టుకున్నాయి.

రామయ్యకు స్నపన తిరుమంజనం..

దేవస్థానంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఉత్సవ మూర్తులకు బుధవారం స్నపన తిరుమంజనం జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



గీతాలు ఆలపిస్తున్న సంగీత కళాకారులు

నష్టపోయే ప్రతి చెట్టునూ లెక్కించాలి

సీసీఎఫ్ భీమానాయక్



నర్సరీని పరిశీలిస్తున్న భీమానాయక్, కృష్ణాగౌడ్ తదితరులు

ఇల్లెందురూరల్ : జాతీయ రహదారి నిర్మాణంలో అటవీశాఖ నష్టపోతున్న ప్రతి చెట్టునూ లెక్కించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) భీమానాయక్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఇల్లెందు – మహబూబాబాద్, ఇల్లెందు – కొత్తగూడెం ప్రధాన రహదారి వెంట బుధవారం ఆయన చెట్లకు వేసిన నంబర్లను పరిశీలించారు. రహదారి పొడవునా ఎన్ని చెట్లు, ఏ జాతికి చెందినవి, ఎంత పరిమాణంలో కోల్పోతున్నామో సమగ్రంగా వివరాలు సేకరించాలని, నష్ట నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఆ తర్వాత జోడుబౌలి నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ప్రస్తుతం నాటేందుకు అనువుగా ఉన్న మొక్కలు, పిలక దశలో ఉన్న మొక్కల వివరాలు ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్, ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, ఇల్లెందు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో డీఎఫ్‌ఓ పర్యటన..

పాల్వంచరూరల్ : మండల పరిధి కిన్నెరసానిని బుధవారం డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్ సందర్శించారు. పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను, డీర్ పార్కును పరిశీలించారు. డీర్ పార్కు పరిసరాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా పనులు నిర్వహిస్తున్న వైల్డ్‌లైఫ్ సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట ఎఫ్‌డీఓ బాబు, రేంజర్లు, కవిత మాధురి, కనకమ్మ, కార్తీక్‌కుమార్, జశ్వంత్, సిబ్బంది కిషన్, రాములు ఉన్నారు.

భారీగా పెరగనున్న పల్లె ఓటర్లు

చుంచుపల్లి: జిల్లాలో పల్లె ఓటర్ల సంఖ్య భారీగా పెరగనుంది. పంచాయతీ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు ఇటీవల ఈసీ మరో అవకాశం కల్పించింది. గతేడాది సెప్టెంబర్ 28న ప్రకటించిన పంచాయతీ ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో 6,33,947 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఆ తర్వాత మరోసారి ఓటర్ల చేర్పులకు దరఖాస్తులు స్వీకరించి జనవరి 6న తుది జాబితాను పంచాయతీలకు పంపించారు. వాటిపై కూడా అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 7న పంచాయతీ ఓటర్ల తుది జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేశారు. కొత్తగా రూపొందించిన జాబితా ప్రకారం జిల్లాలో మరో 4, 5 వేల మంది ఓటర్లు పెరగనున్నారని అధికారులు తెలిపారు. ఇవి కాకుండా గతంలో పరిగణనలోకి తీసుకోని భద్రాచలంలో 41,008 మంది ఓటర్లు, సారపాకలో 19,044 మంది ఓటర్లు సైతం తుది జాబితాలో చేరనున్నారు. దీంతో జిల్లాలో దాదాపు 64 వేలకు పైగా పల్లె ఓటర్లు పెరగనున్నారు. ఇక అశ్వారావుపేటలో మూడు గ్రామాలు తగ్గడంతో మొత్తం 478 జీపీల తుది జాబితాను అధికారులు శుక్రవారం వెల్లడిస్తారు.



ఓటరు జాబితాపై కసరత్తు చేస్తున్న సిబ్బంది

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

దుమ్ముగూడెం : గిరిజన మహిళలు ఐక్యంగా ఉంటూ స్వశక్తితో కుటీర పరిశ్రమలు నెలకొల్పాలని, తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. మండలంలోని లక్ష్మీనగరంలో గిరిజన చిక్కి యూనిట్‌ను బుధవారం ఆయన పరిశీలించి, పల్లీపట్టి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటివద్ద ఖాళీగా ఉండే ఏడుగురు మహిళలు రూ.24 లక్షల సబ్సిడీతో రూ.40 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన చిక్కి యూనిట్‌తో జీవనోపాధి సాధించడం హర్షణీయమని అన్నారు. పల్లీపట్టి తయారీకి నాణ్యమైన ముడి సరుకులు వినియోగించాలని, అందమైన ప్యాకింగ్ చేసి సరసమైన ధరలకు విక్రయించాలని చెప్పారు.

అత్యుత్తమ మార్కులు సాధించాలి..

విద్యార్థుల భవిష్యత్‌కు తొలి అడుగు పదో తరగతిలోనే పడుతుందని, శ్రద్ధగా చదివి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పీఓ సూచించారు. మండలంలోని రేగుబల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్షలు రాసేప్పుడు పాటించాల్సిన మెళకువలను వివరించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదివి 10/10 ర్యాంక్ సాధించాలని పిలుపునిచ్చారు. పరీక్షలకు ఇంకా 40 రోజుల సమయం ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినులకు రగ్గులు, పదో తరగతి స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏటీడీఓ అశోక్‌కుమార్, ఎస్‌ఓ ఉదయభాస్కర్, తహసీల్దార్ అశోక్‌కుమార్, హెచ్‌ఎం సావిత్రి, వార్డెన్ శారద పాల్గొన్నారు.



దుమ్ముగూడెం మండలం రేగుబల్లిలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న పీఓ రాహుల్

పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తేవాలి

అశ్వాపురం : జిల్లాలో పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నా వాటిని గుర్తించక మరుగునపడిపోతున్నాయని, వెలుగులోకి తెస్తే జిల్లాకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని పీఓ రాహుల్ అన్నారు. మండలంలోని తుమ్మలచెరువును బుధవారం ఆయన సందర్శించి బోటింగ్ చేశారు. బోటింగ్‌కు వచ్చే పర్యాటకులతో నిర్వాహకులు మర్యాదగా వ్యవహరించాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట జేడీఎం హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి దినేష్‌కుమార్ ఉన్నారు.

'భరోసా' ఎప్పుడో ?

- పెట్టుబడి సాయం కోసం నిరీక్షణ
- మండలానికి ఒక గ్రామంలోనే అందిన రైతు భరోసా
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన

బూర్గంపాడు: పంటల సాగుకు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం రైతు భరోసా కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించిన సాయం అందనే లేదు. యాసంగి పంటల సాగుకు జనవరి 26 నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడి రైతులకు మాత్రమే 'భరోసా' అందించారు. దీంతో మిగతా గ్రామాల రైతులు తమకు సాయం అందేదెప్పుడో అని నిరీక్షిస్తున్నారు. ఇంతలోనే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో రైతు భరోసాపై అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. మరో వారం రోజులలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడుతుందనే ఊహాగానాలతో ఈ భయం మరింతగా పెరిగింది. ఎన్నికల కోడ్‌కు ముందే రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో ఇబ్బందులు ఉండకపోవచ్చని కొందరు అంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

వానాకాలంలో మొండిచేయి..

ఈ ఏడాది వానాకాలం పంటలకు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందించలేదు. యాసంగి సాగుకైనా పెట్టుబడి సాయం అందుతుందా అని రైతులు ఆలోచనలో పడ్డారు. ఇంతలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిపబ్లిక్ డే సందర్భంగా నాలుగు పథకాలను అట్టహాసంగా ప్రారంభించారు. అందులో రైతు భరోసా కూడా ఉండటంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇంతలోనే మండలానికి ఓ గ్రామం చొప్పున తొలి విడత పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి నిధులు ఆయా రైతుల ఖాతాల్లో జమచేసింది. దీంతో మిగిలిన గ్రామాల రైతులు పెట్టుబడి ఖర్చులకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎకరాకు రూ. 6 వేలు పెట్టుబడి సాయం అందుతుందని భావించారు. డిసెంబర్ నుంచే యాసంగి పంటల సాగుకు ఉపక్రమించారు. ఇప్పటికే యాసంగి వరినాట్లు వేసిన రైతులు రెండు విడతల ఎరువులు కూడా వేసుకున్నారు. పెట్టుబడి సాయం ఆలస్యమైతే యాసంగి సీజన్ పూర్తవుతుందని, పంటల సాగు సమయంలోనే రైతు భరోసా అందిస్తే ఎరువులకు, కూలీలకు ఉపయోగపడతాయని రైతులు అంటున్నారు.

ఇప్పుడు 25 గ్రామాల్లోనే..

గత నెల 26వ తేదీన జిల్లాలోని 23 మండలాల్లో 25 గ్రామాలకు చెందిన 22, 242 మంది రైతులకు రూ. 39.06 కోట్లు రైతు భరోసా కింద వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. మిగిలిన గ్రామాల రైతులకు భరోసా ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి. ప్రభుత్వం మార్చి 31 వరకు రైతు భరోసా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని చెబుతోంది. అయితే ఇంతలోనే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఇది మార్చి 3 వరకు అమల్లో ఉంటుంది. మరో వారం రోజుల్లో స్థానిక సంస్థల



ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారనే ప్రచారంతో రైతుల్లో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

రైతు భరోసా వెంటనే అందించాలి

రైతులకు సకాలంలో రైతు భరోసా పెట్టుబడి సాయమందిస్తే ఉపయోగం ఉంటుంది. ప్రభుత్వం జనవరి 26న రైతు భరోసా అందిస్తామని ప్రకటించింది. ఆ తర్వాత మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ ఊరి రైతులకే అందించింది. మిగితా రైతులకు కూడా వెంటనే సాయం అందించాలి.

– దుప్పటి రాజు, రెడ్డిపాలెం

పంట కాలంలోనే ఇవ్వాలి

పంటలు సాగు చేసేటప్పుడే పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ప్రైవేటు అప్పులు తీసుకోకుండా రైతు భరోసాను పెట్టుబడులకు వాడుకుంటాం. వానాకాలం సాయమందలేదు. కనీసం యాసంగికి కూడా సకాలంలో అందే పరిస్థితి కనిపించటం లేదు.

– ఆవుల శ్రీనివాసరెడ్డి, నాగినేనిప్రోలు

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే..

ప్రభుత్వ నిర్ణయం మేరకే రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమవుతుంది. సాగుకు యోగ్యమైన భూముల వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపించాం. తొలి విడతగా మండలానికి ఓ రెవెన్యూ గ్రామానికి చెందిన రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమైంది. మిగతా గ్రామాల రైతులకు కూడా త్వరలోనే జమవుతుందనే సమాచారం ఉంది.

– తాతారావు, ఏడీఏ, మణుగూరు

క్లుప్తంగా

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులు పాల్గొనాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఐటీడీఏ అధికారులు

భద్రాచలం: విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొంటే క్రమశిక్షణతోపాటు సమాజ సేవపై అవగాహన పెరుగుతుందని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో ఇటీవల డైమండ్ సిల్వర్ జూబ్లీ జంబూరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంకంపాలెం, రేగుబల్లి, భద్రాచలం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు హాజరై వచ్చారు. బుధవారం విద్యార్థులు ఏపీఓను కలువగా, ఆయన అభినందించి మాట్లాడారు. ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, స్కౌట్ అండ్ గైడ్స్ ఇన్‌చార్జి నరేందర్, లక్ష్మి, చెన్నయ్య పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటకోత్సవాలు



స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. రెండో రోజు బుధవారం నిర్వహించిన పాడుతా తీయగా జూనియర్స్ సినీ పాటల మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో చిన్నారులు వాగ్దేవి, సహ్రస, ధీరజ్, రిషీల్, వేదాన్ష్‌లు తమ గానంతో ఆకట్టుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన స్వేచ్ఛ నాటిక చూపరులను కట్టిపడేసింది. స్వేచ్ఛ అంటే యథేచ్ఛ కాదని, మనసుకు నచ్చినట్లు, ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా ప్రవర్తిస్తే జీవితంలో ఎలా నష్టపోతామనే విషయాన్ని నాటికలో వివరించారు. ఆ తర్వాత పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కళాభారతి వ్యవస్థాపకుడు అల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'దొడ్డి కొమరయ్య' వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



దొడ్డి కొమరయ్య పోస్టర్‌తో దర్శకుడు సేనాపతి

పాల్వంచ: ఈ నెల 11న కొత్తగూడెం బీసీ భవనంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తామని చిత్ర దర్శకుడు ఎం.సేనాపతి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆవిష్కరణ అనంతరం మహనీయుల ర్యాలీ, 26 మంది సహా నిర్మాతలకు సన్మానం ఉంటుందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దొడ్డి కొమురయ్య ప్రాణాలు అర్పించాడని గుర్తుచేశారు. మహబూబాబాద్ జిల్లా దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ జిల్లా చైర్మన్ జి.సక్రు తదితరులు మాట్లాడారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

నో టెన్షన్.. ఓన్లీ ప్రిపరేషన్

- 'పరీక్షా' కాలం సమీపిస్తుండటంతో విద్యార్థుల ఆందోళన
- మార్చిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు
- భయం, ఆందోళనతో క్షణికావేశంలో నిర్ణయం తీసుకోవొద్దు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని నిపుణుల సూచనలు



తరగతి గదిలో ఇంటర్మీడియట్ విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: పబ్లిక్ పరీక్షల సమయం సమీపిస్తుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వార్షిక పరీక్షలు ఎలా రాయాలోననే ఆలోచనలతో ఒత్తిడికి గురవుతున్నారు. బాగానే చదువుతున్నా భయం కారణంగా తెలిసిన ప్రశ్నలకు కూడా జవాబులు రాయలేకపోతారని, ఫలితంగా మార్కుల్లో వెనకబడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భయం పోగొట్టుకుని తగిన రీతిలో సాధన చేస్తే ఫైనల్ పరీక్షల్లో విజయం సాధించవచ్చని, గత పరీక్షల మార్కులను ఫైనల్ పరీక్షలతో అంచనాలు వేసుకోవడం సరికాదని సూచిస్తున్నారు. ఉత్తమ మార్కులు తెచ్చుకోగలమనే దృఢ సంకల్పంతో పరీక్షలు రాయాలని పేర్కొంటున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలో పదో తరగతి విద్యార్థిని మార్కులు సరిగ్గ రావేమోనని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. అనవసరంగా ఆందోళన చెందకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలని సూచిస్తున్నారు.

సంసిద్ధం చేయాలి

మార్చి 6 తేదీ నుంచి 15వ తేదీ వరకు పదో తరగతి విద్యార్థులు ప్రీ ఫైనల్, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 299 పాఠశాలల్లోని 12,282 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. గత సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 22న ముగియనున్నాయి. వార్షిక థియరీ పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం అవసరం. పరీక్షలపై భయం పోయేలా తగిన రీతిలో వారిని సిద్ధం చేయాలి. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలంటే పరీక్షలు బాగా రాయాలని, క్షణికావేశాలు సరికాదని నిపుణులు సూచిస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు

- రానున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని, ఇటీవల కళాశాలలో జరిగిన పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రి మందలించడంతో కొత్తగూడెం త్రీటౌన్ పరిధి ప్రగతినగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి డిసెంబర్ 7న ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది.
- అశ్వారావుపేట మండల కేంద్రంలోని దండా బత్తుల వారి బజార్‌కు చెందిన విద్యార్థి ఇంట్లో తల్లి మందలించిందని డిసెంబర్ 7న ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- జూలూరుపాడు మండలం రామచంద్రపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి మనోవేదనతో డిసెంబర్ 14న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయాడు.
- జూలూరుపాడు మండలం వెంగన్న పాలెం గ్రామానికి చెందిన యువకుడు డిసెంబర్ 30న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

క్షణికావేశంతో అనర్థాలు



విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి. ఒత్తిడి, భయాందోళనతో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు. పరీక్ష సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో పిల్లలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మనోధైర్యం కల్పించాలి. ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

–వెంకటేశ్వరాచారి, డీఈఓ

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జేబీపీ

పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్



జాతీయ అధ్యక్షుడి సమక్షంలో జేబీపీలో చేరిన కామేష్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రంలో జైభీమ్ రావ్ భారత్ పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగనుందని, అందుకు హైకోర్టు న్యాయవాది యెర్రా కామేష్ సేవలను వినియోగించుకుంటామని జేబీపీ జాతీ య అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ తెలిపారు. బీఎస్పీకి రాజీనామా చేసిన పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్ తన అనచరులతో కలిసి బుధవారం విజయవాడలోని జాతీయ పార్టీ కార్యాలయంలో జేబీపీలో చేరారు. జేబీపీ జాతీయ అధ్యక్షుడు పార్టీ కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు కామేష్‌ను అన్ని పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని ముందుండి నడిపించే క్రమంలో రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలను అప్పగిస్తామని శ్రావణ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు కామేష్ తెలిపారు. తనతోపాటు గంధం మల్లికార్జున రావు, నాగుల రవికుమార్, వినయ్, సోను, కొండా రాజేష్, మద్దిరాళ్ల కిషోర్, బన్ను,సుబ్బారావు జేబీపీలో చేరారని పేర్కొన్నారు.

'రవాణా' సంక్షేమ చట్టం తేవాలి

ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య



ప్రసంగిస్తున్న కంచర్ల జమలయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ చట్టం తేవాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. శేషగిరిభవన్‌లో బుధవారం నిర్వహించిన ఆటోవర్కర్స్ యూనియన్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆటో, ప్రైవేట్ వాహనాలను నడుపుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న రవాణారంగ కార్మికుల సంక్షేమాన్ని పాలకుల విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటుపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు బత్తుల సత్యనారాయణ, మర్రి కృష్ణ, భాస్కర్, జనార్దన్, ఆరెల్లి కృష్ణ, నరసింహా, గణేష్, చింటూ, కోటి రామరాజు, రాజు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కేసు నమోదు

పాల్వంచరూరల్: స్మార్ట్‌ఫోన్‌లో ఓ యాప్‌ను ఓపెన్ చేసి రుణం కోసం ప్రయత్నించగా మభ్యపెట్టి నగదు కాజేశారు. ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన ఇర్ప మానస ఇటీవల ఫోన్ యాప్ ద్వారా లోన్ కోసం ప్రయత్నించింది. ముందుగా కొంత డబ్బు డిపాజిట్ చేస్తే రుణం వస్తుందని యాప్ నిర్వాహకులు నమ్మించారు. దీంతో ఆమె రూ.62,350 చెల్లించింది. ఆ తర్వాత ఆ యాప్ పనిచేయకపోవడంతో మోసపోయానని గ్రహించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైబర్ క్రైం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: యువతిని మోసం చేసిన ఘటనలో పట్టణానికి చెందిన న్యాయవాదిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఓ యువతి తన భర్త నుంచి విడాకులు తీసుకునే విషయంలో పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన భరణి వెంకట కార్తీక్ అనే న్యాయవాదిని సంప్రదించింది. తరచూ కలుస్తున్న క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం పెరిగింది. దీంతో పెళ్లి చేసుకుంటానని చెప్పి న్యాయవాది ఆమెను శారీరకంగా వాడుకున్నాడు. యువతి గర్భవతి కాగా దూరం పెట్టాడు. బాధితురాలు పెద్ద మనుషులను, పోలీసులను ఆశ్రయించగా, వారి సమక్షంలో పెళ్లికి అంగీకరించాడు. మరుసటి రోజు నుంచి పెళ్లికి నిరాకరిస్తుండటంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్ట్ చేసేందుకు వెళ్లగా భరణి వెంకట కార్తీక్ ఇంట్లో లేకపోవడంతో గాలింపు చేపట్టారు.

సత్తుపల్లి బస్టాండ్‌లో చోరీ

రూ.3 లక్షల నగలు అపహరణ

సత్తుపల్లిటౌన్: బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌లోని నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడుకు చెందిన యాచమనేని రాధిక బుధవారం హైదరాబాద్ నుంచి సత్తుపల్లి బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బుగ్గపాడు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న రూ.3 లక్షల విలువైన బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బస్సులో కూర్చున్నాక హ్యాండ్ బ్యాగ్ తెరిచి ఉండటం, అందులో నగలు లేకపోవడంతో చోరీ అయినట్లు గుర్తించి సత్తుపల్లి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది.

సిగరెట్ కోసం వచ్చి గొలుసు...

పెనుబల్లి: కిరాణం షాప్‌లో సిగరెట్ కోసమంటూ వచ్చిన వ్యక్తి యజమాని మెడలో గొలుసు లాక్కెళ్లాడు. మండలంలోని ఎడ్ల బంజరలో ఇప్పిరిశెట్టి రామయ్య కిరాణం షాప్‌నకు బుధవారం రాత్రి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్, కూల్‌డ్రింక్ కావాలని అడిగాడు. దీంతో రామయ్య ఇస్తుండగానే ఆయన మెడలోని రూ.1.20లక్షల విలువైన 15గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో విత్తన కంపెనీ ఆర్గనైజర్

టేకులపల్లి: మొక్కజొన్న విత్తనాల కేసులో టేకులపల్లి పోలీసులు బుధవారం రాత్రి విత్తన కంపెనీ ఆర్గనైజర్ తోకల రాజేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. టేకులపల్లి ఎస్‌ఐ పోగుల సురేష్ కథనం ప్రకారం.. వసుధ విత్తన కంపెనీకి చెందిన ఆడ మగ మొక్కజొన్న విత్తనాలను ఆ కంపెనీ ఆర్గనైజర్ వరంగల్‌కు చెందిన తోకల రాజేందర్‌రెడ్డి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ద్వారా నెలన్నర క్రితం చంద్రుతండా, గోప్యాతండా, సూర్యాతండా రైతులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే లక్కినేని సురేందర్‌రావు, భూక్య రాజాలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు తాజాగా విత్తన కంపెనీ ఆర్గనైజర్ రాజేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

పల్లె ప్రకృతి వనం ధ్వంసం



మొక్కలను ధ్వంసం చేసి చదును చేసిన భూమి

అశ్వారావుపేటరూరల్: పల్లె ప్రకృతి వనంలో మొక్కలను బుధవారం కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం.. మండలంలోని మద్దికొండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 2020–21 సంవత్సరంలో దాదాపు అర ఎకరం విస్తీర్ణంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. వనంలో ఏపుగా పెరిగిన మొక్కలను కొందరు ధ్వంసం చేసి నేలను చదును చేశారు. దీంతో ప్రకృతి వనం స్థలాన్ని కబ్జా చేసేందుకే ఈ చర్యలకు పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి సమయ్యను వివరణ కోరగా.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కల్లూరు: మండలంలోని గనియాతండా సమీపాన ఎన్నెస్పీ కెనాల్ లాక్‌ల వద్ద మంగళవారం అర్ధరాత్రి ఎస్‌ఐ హారిక, సిబ్బంది తనిఖీలు చేపట్టి పేకాట ఆడుతున్న కల్లూరుకు చెందిన ఐదుగురిగిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,040 నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కాగా, పోలీసులను చూసి మరో ఇద్దరు పరారయ్యారు.

ఆరుగురి బైండోవర్

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా, భీమ్లాతండా, మాచినేనిపేట, పాపకొల్లు, సురారం గ్రామాలకు చెందిన ఆరుగురు నాటు సారా తయారీదారులను బుధవారం ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ కె.స్వాతిబిందు ఎదుట బైండోవర్ చేశారు. వారు మరోసారి నాటుసారా తయారు చేయబోమని, విక్రయించబోమని ఒక్కొక్కరు రూ.2 లక్షల పూచీకత్తును తహసీల్దార్‌కు సమర్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ సిబ్బంది ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ శివారులో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మల్లెలమడుగు గ్రామానికి మాజీ ఉపసర్పంచ్, సీనియర్ పాత్రికేయుడు కమటం వెంకన్న బైక్‌పై వస్తుండగా మణుగూరు వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో వెంకన్న కాలు విరిగింది. స్థానికులు క్షతగాత్రుడిని భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో ఎలక్ట్రీషియన్ మృతి



వెంకటాచారి (ఫైల్)

చంద్రుగొండ : చంద్రుగొండకు చెందిన సీనియర్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సోము వెంకటాచారి (60) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ రుక్మిణి, మాజీ వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, కృష్ణారెడ్డి తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎలక్ట్రీషియన్ల సంఘం మండల నాయకులు ఎస్కే ఆసీఫ్, బాబూరావులు కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి మత్తులో పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారేపల్లి మండలం గాంధీనగర్‌కు చెందిన ఈసం రాములు(54) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసైన ఆయన మతిస్థిమితం కోల్పోగా, మత్తులోనే గత నెల 30వ తేదీన చేను వద్ద పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయన కుమార్తె మాధవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నాగరాజకుమారి తెలిపారు.

కోలిండియా క్రికెట్ టోర్నీలో సెమీస్‌కు సింగరేణి జట్టు



సెమీఫైనల్స్ చేరిన సింగరేణి క్రికెట్ జట్టు

సింగరేణి(కొత్తగూడెం): మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరుగుతున్న కోలిండియా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో సింగరేణి జట్టు సత్తా చాటుతోంది. కోలిండియా పరిధిలోని మొత్తం పది బొగ్గు పరిశ్రమల జట్లు టోర్నీలో పాల్గొంటుండగా గ్రూప్–ఏలో సింగరేణి సహా ఎస్‌సీఎల్, ఎంసీఎల్ జట్లు ఉన్నాయి. ఈ నెల 4న ఎంసీఎల్‌తో జరిగిన మ్యాచ్‌లో సింగరేణి జట్టు 28 పరుగుల తేడాతో, బుధవారం ఎస్‌సీఎల్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ విజయం సాధించి గ్రూప్–ఏలో అగ్రస్థానాన నిలిచింది. ఫలితంగా జట్టు సెమీఫైనల్స్‌కు చేరింది. కాగా, సింగరేణి జట్టు విజయంలో బ్యాట్స్‌మెన్లు శశికాంత్, శశ్వంత్, ఆల్ రౌండర్ హరికిషన్, బౌలర్లు యుగంధర్, మహేశ్ కీలకపాత్ర వహించారు.

క్యారమ్స్ పోటీల్లో చాంపియన్ షిప్

కోలిండియా స్థాయి క్యారమ్స్ పోటీలో సింగరేణి జట్టు చాంపియన్ షిప్ సాధించింది. జార్ఖండ్‌లోని రాంచీలో సీఎంపీడీఐఎల్ ఆధ్వర్యాన ఈ టోర్నీ నిర్వహించారు. ఇందులో సింగరేణి టీమ్ ఓవరాల్ చాంపియన్ షిప్ గెలుచుకుంది. అలాగే, డబుల్స్ విభాగంలో భూపాలపల్లి, బెల్లంపల్లి ఏరియా క్రీడాకారులు బి.శ్రీనివాస్, ఓ.మల్లేశ్ రన్నర్లుగా, శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన సృజన్‌రావు సింగిల్స్‌లో విజయం సాధించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



ఇసుక రాశులను పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో ఉన్న వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అశ్వారావుపేట గ్రామ శివారులో గుర్తించి పట్టుకున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

ములకలపల్లి: అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరు గ్రామశివారులో ఇసుక డంప్ చేసినట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు తహసీల్దార్ గుడ్ల పుల్లారావు తెలిపారు. అనుమతులు లేకుండా నిల్వ చేసిన సుమారు 25 ట్రాక్టర్ల ఇసుక రాశులను సీజ్ చేసి, తహసీల్‌కు తరలించారు. గిర్దావర్–2 భద్రు, సిబ్బంది పాల్గొన్నారు.

వీకే రామవరంలో..

వీకే రామవరం శివారులో కూడా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక రాశులను రెవెన్యూ అధికారులు గుర్తించారు. తహసీల్దార్, గిర్దావర్–2 భద్రు తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. సుమారు 8 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.


స్వగ్రామంలో సినీ నిర్మాత కేపీ చౌదరి అంత్యక్రియలు

హాజరైన పలువురు నటీనటులు



కేపీ చౌదరి అంతిమయాత్రలో పాల్గొన్న బంధువులు

బోనకల్: తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న నిర్మాత బోడెపూడి కృష్ణప్రసాద్ (కే.పీ.చౌదరి) గత సోమవారం గోవాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన బోనకల్ మండలం రాయన్నపేటకు తీసుకురాగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన భార్య శ్రేష్ఠ కొన్నాళ్లుగా కుటుంబ కలహాలతో వేరు ఉంటుండగా కుమారుడు కార్తికేయతో కలిసి వచ్చారు. ఈ మేరకు కృష్ణప్రసాద్‌కు ఆయన కుమారుడు కార్తికేయ అంత్యక్రియలు చేశారు. సినీ నటులు సురేఖావాణి, జ్యోతి, దేవి, హేమ, సుప్రియ తదితరులు హాజరయ్యారు. కాగా, నటి హేమ మాట్లాడుతుండగా వీడియో తీసే క్రమాన ఓ చానల్ జర్నలిస్ట్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోలు, వీడియో తీస్తే కెమెరా పగులకొడతానని హెచ్చరించడం గమనార్హం.



సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS SERVICES

- మీ బంగారం మణపురం, ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

Wanted

WANTED

- నెలకు రూ॥ 12 వేల జీతంతో, కనీసం ఇంటరు చదివిన పురుష అభ్యర్థులు, LIC Chief Advisor ఆఫీసునందు అసిస్టెంట్‌గా పనిచేయుటకు ఈ రోజు సా॥ 5:00గం॥లకు జరిగే ఇంటర్వ్యూకు మీ బయోడేటా ఫారంతో హాజరు కాగలరు. మంచి భవిష్యత్తు చూపబడును. 98480 39047 [M-1268556]
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [SCA25001467]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.